బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పని చేయాలి

మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్
- బీఆర్ఎస్ బీర్‌పూర్ గ్రామ కమిటీ నియామకం

సారంగాపూర్, నవంబర్ 21: బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత–సురేశ్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు నేతృత్వంలో గురువారం బీర్‌పూర్‌లో పార్టీ గ్రామ కమిటీని నియమించారు. మొదట మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, గ్రామాల్లో పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని కోరారు. బీఆర్ఎస్ శ్రేణులకు ఎలాంటి ఆపద వచ్చిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణతో కలిసి తాము ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ బీర్‌పూర్ గ్రామ కమిటీని ప్రకటించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గడ్డమీది రాంచంద్రం, ప్రధాన కార్యదర్శిగా శనిగరపు సుదర్శన్, ఉపాధ్యక్షులుగా చిగురు రాములు, ఎనుగంటి జితేందర్, చీర్నెని రవి, ప్రచార కార్యదర్శిగా చెట్‌పల్లి సత్యనారాయణ, ముఖ్య సలహాదారుగా చల్ల లక్ష్మణ్, కార్యదర్శులుగా నేరెళ్ల కృష్ణమూర్తి, గోపీప్రసాద్, సముద్రాల సతీశ్, అల్లెపు సురేందర్, గడిపెల్లి నరేశ్, అజ్మీర ప్రభాకర్, సహాయ కార్యదర్శులుగా కలమడుగు రాకేశ్, బట్టపెల్లి రాజేశ్, బండారి విష్ణు, దావన్‌పెల్లి సంతోష్‌తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నేరెళ్ల సుమన్ గౌడ్, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, నాయకులు ఉయ్యాల కిషన్, సుదర్శన్, వెంకటేశ్, రవీందర్, మల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్: కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

కొనుగోళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- కలెక్టర్ సత్యప్రసాద్
- మేడిపల్లి, రాయికల్ మండలాల్లో కొనుగోలు కేంద్రాల పరిశీలన

మేడిపల్లి/జగిత్యాల టౌన్, నవంబర్ 21: ధాన్యం కొనుగోళ్ల వివరాలు ట్యాబ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. మేడిపల్లి మండలం కట్లకుంట, పోరుమల్ల, రాయికల్ మండలం వీరాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కొనుగోళ్ల వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఆర్డీవోలు జీవాకర్‌రెడ్డి, మధుసూదన్, ఏపీఎం గట్ల అశోక్, సీసీలు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

రాయికల్, నవంబర్ 21: అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ ఖయ్యుమ్, అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లపై టోల్‌ఫ్రీ నంబర్

జగిత్యాల టౌన్, నవంబర్ 21: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలన్న సంకల్పంతో టోల్ ఫ్రీ నంబర్ 1912ను ట్రాన్స్‌ఫార్మర్లపై ఏర్పాటు చేస్తున్నట్లు జగిత్యాల సర్కిల్ ఎస్ఈ సాలియా నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. వినియోగదారుడు టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయగానే అట్టి ఫిర్యాదును స్వీకరించి, సమాచారం సంబంధిత అధికారికి వెళ్తుందని తెలిపారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల టౌన్, నవంబర్ 21: మెట్‌పల్లిలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్ ఏడో తరగతి విద్యార్థి మోక్షిత్ 100 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చూపి మూడో స్థానంలో నిలిచినట్లు పాఠశాల పీడీ రాధిక తెలిపారు. అలాగే, పది మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ చూపి ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు రామానుజన్, ఉపాధ్యాయ సంఘం నాయకులు బోనగిరి దేవయ్య, జయశ్రీ, రజాక్, రజిత, శ్రీలత, శ్రీనివాస్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, కరుణాకర్, కుమార్, జుబేర్, సత్యనారాయణ అభినందించారు.

ఎమ్మెల్సీని కలిసిన మత్స్యకారులు

జగిత్యాల టౌన్, నవంబర్ 21: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల మత్స్యకారులు గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మత్స్యకారులకు వల, చేపలు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, చేపలు ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

అందుకున్న ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

జగిత్యాల టౌన్, నవంబర్ 21: పట్టణంలోని జ్యోతి హైస్కూల్ విద్యార్థులు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి ప్రశంసా పత్రాలు, బహుమతులు సాధించారు. విద్యార్థులను గురువారం పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

పంట పొలాల పరిశీలన

జగిత్యాల రూరల్, నవంబర్ 21: మండలంలోని ధరూర్ గ్రామంలో పంట పొలాలను గురువారం మండల వ్యవసాయాధికారి వినీల పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వరి కొయ్యలను కాల్చితే భూసారం తగ్గుతుందన్నారు. భూమిలో కలియ దున్నాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, రైతులు కొలుగూరి సదాశివరావు, శ్రీనివాస్ రావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాధికారికి వినతి

డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

జగిత్యాల టౌన్, నవంబర్ 21: సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గురువారం జిల్లా విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఒప్పంద ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి రవీందర్, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం

శ్రీనివాసుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కోరుట్ల, నవంబర్ 21: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని భూదేవీ, శ్రీదేవీ సమేత శ్రీనివాసుడి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులు దీపాలంకరణ చేశారు. ఆలయ ఈవో విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, శ్రీలలిత సేవా ట్రస్టు అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

బీటులో దినుసుల కొనుగోళ్లు

జగిత్యాల టౌన్, నవంబర్ 21: జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం మక్కలు క్వింటాలుకు కనిష్ఠ ధర రూ. 1900, గరిష్ఠ ధర రూ. 2377 చొప్పున పలికినట్లు మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీయూ 1010 రకం వరి ధాన్యానికి రూ. 1949–2175, హెచ్ఎంటీ రూ. 2000–2150, జేఎస్ఆర్ రూ. 2000–2811 చొప్పున పలికినట్లు వివరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మేడిపల్లి, నవంబర్ 21: భీమారం మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండ కిషన్‌గౌడ్, మేడిపల్లికి చెందిన రావు రాజేశ్వర్ రావు ఇటీవల మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబసభ్యులను గురువారం జడ్పీ మాజీ అధ్యక్షురాలు తుల ఉమ పరామర్శించారు. ఆమె వెంట మాజీ ప్రజాప్రతినిధులు చెన్నమనేని రవీందర్‌రావు, ఆనంద్ కుమార్, ఆన్‌రెడ్డి గంగారెడ్డి, నాయకుడు మారుతిగౌడ్ తదితరులున్నారు.

మాజీ ఎంపీపీ నిరసన దీక్ష

కథలాపూర్, నవంబర్ 21: కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయం గేట్ వద్ద సిరికొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నాంపెల్లి లింబాద్రి గురువారం నిరసన దీక్ష చేపట్టారు. సిరికొండ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా సొంత భవనంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆధార్ సెంటర్ నిర్వహించాల్సి ఉండగా, నిర్వాహకుడు తన ఇంట్లో నిర్వహిస్తున్నారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన దీక్ష చేపట్టారు. లింబాద్రికి పలువురు నాయకులు సంఘీభావం ప్రకటించారు.

గ్రామానికి సేవ చేస్తే భగవంతుడికి చేసినట్లే

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల రూరల్, నవంబర్ 21: పుట్టి పెరిగిన గ్రామానికి సేవ చేస్తే భగవంతుడికి సేవా చేసినట్లేనని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. అంతర్గాంలోని ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతుల కోసం ఎమ్మెల్యే గురువారం ప్రొజెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన ఊరు కన్న తల్లిలాంటిదని అన్నారు. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, బోనగిరి నారాయణ, రాజిరెడ్డి, భూపెల్లి శ్రీనివాస్, నోముల శేఖర్‌రెడ్డి, ఎంపీడీవో రమాదేవి, ఎంఈవో గాయత్రి, ప్రధానోపాధ్యాయుడు మహిపాల్‌రెడ్డి, సీడీపీవో మమత, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్, నవంబర్ 21: జగిత్యాల పట్టణంలో గల్ఫ్ గంగపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం నిర్వహించగా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు తిరుపతి, కౌన్సిలర్ జుంబర్తి రాజ్‌కుమార్, ఎఫ్‌సీఎస్ సంఘం అధ్యక్షుడు గుమ్ముల అంజయ్య, డైరెక్టర్ పవన్, సభ్యులు ప్రవీణ్, నాచుపల్లి రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రేచపల్లిలో గంజాయి పట్టివేత

సారంగాపూర్, నవంబర్ 21: మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి తిరుపతి తన వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలు పెంచుతున్నాడనే పక్కా సమాచారంతో గురువారం ఎస్ఐ దత్తాద్రి సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. పసుపు పంటలో తొమ్మిది గంజాయి మొక్కలు, 300 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నారు. గంజాయి విలువ రూ. 97,500 ఉంటుందని ఎస్ఐ దత్తాద్రి పేర్కొన్నారు. గంజాయి సీజ్ చేసి, తిరుపతిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఇసుక వేలం

ఇబ్రహీంపట్నం, నవంబర్ 21: మండలంలోని కోమటికొండాపూర్ గ్రామంలో ఇటీవల సీజ్ చేసిన ఇసుకకు తహసీల్ కార్యాలయంలో గురువారం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ, 40 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను వేలం పాట నిర్వహించగా కోమటికొండాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీనర్సయ్య రూ.51వేలకు దక్కించుకున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ జీఎస్ లత

సారంగాపూర్, నవంబర్ 21: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జీఎస్ లత సూచించారు. మండలంలోని రేచపల్లి, లచ్చనాయక్ తండా, మ్యాడారం, లక్ష్మీదేవిపల్లి, పెంబట్ల, కోనాపూర్, సారంగాపూర్, పోతారం, రంగపేట, నాగునూర్, తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు, తేమశాతాన్ని పరిశీలించారు. తాలు, తప్ప లేకుండా ధాన్యం శుభ్రం చేయాలని, నాణ్యతా ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్, నాయబ్ తహసీల్దార్ లాస్యశ్రీ, ఆర్ఐ భాస్కర్ రావు, మాజీ వార్డు సభ్యుడు బేర మహేశ్, సివిల్ సప్లయ్ అధికారులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం

మల్లాపూర్, నవంబర్ 21: మండలంలో ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం, ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండలాధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యాంటి బయోటిక్స్ వినియోగాన్ని నియంత్రించాలి

అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు

జగిత్యాల రూరల్, నవంబర్ 21: యాంటి బయోటిక్స్ అతి వినియోగాన్ని నియంత్రించాలని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్ సూచించారు. పట్టణంలోని ఐఎంఏ హాల్లో గురువారం ప్రపంచ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెటన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకొని సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు డాక్టర్ అర్చన, చక్రధర్, డాక్టర్ గురువారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ సుధీర్‌కుమార్, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాలిపోయిన ఇల్లు పరిశీలన

సారంగాపూర్, నవంబర్ 21: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన చల్ల గంగమల్లు ఇల్లు అగ్నిప్రమాదంలో కాలిపోగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి పరిశీలించారు. నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడెపు నర్సయ్య, పాత రమేశ్, గర్షకుర్తి రమేశ్, ఓగుల అజయ్, లక్ష్మణ్, నాగరాజు, రాజు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 21: మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి మండల వైద్యాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. రెండేళ్ల క్రితం ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేయగా, స్థలం లేక భవన నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. మాజీ సర్పంచ్ మారంపెల్లి శ్రీనివాస్, గుమ్లాపూర్ మాజీ ఎంపీటీసీ వెంకటేశ్‌కు చెందిన మూడు గుంటల స్థలాన్ని భవన నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. ఈమేరకు సంబంధిత స్థలంలో ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం చేపడుతున్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, పంచాయతీ రాజ్ డీఈ అన్వర్, మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మారంపెల్లి శ్రీనివాస్, వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

బాధితుడిని ఆదుకోవాలి

జగిత్యాల రూరల్, నవంబర్ 21: మండలంలోని బాలపల్లి గ్రామంలో బేతి తిరుపతి రెడ్డికి చెందిన ఎలక్ట్రిక్ బైక్‌కు గురువారం చార్జింగ్ పెట్టగా, షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత–సురేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ రావు, పడిగెల గంగారెడ్డి, రవి, ప్రమోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ కళాశాల విద్యార్థి అదృశ్యం

హితేశ్

కొడిమ్యాల, నవంబర్ 21: మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ రెండో సంవత్సరం చదువుతున్న అర్నిపల్లి హితేశ్ అదృశ్యమయ్యాడు. మల్యాల సీఐ నీలం రవి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురం జిల్లా గరువుబిల్ల మండలం రావివలస గ్రామానికి చెందిన హితేశ్ కళాశాలలో ఇంజినీరింగ్ (మెకానికల్) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 19న కళాశాల ఓల్డ్ హాస్టల్ బంగ్లా పక్కనున్న గోడవైపు నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. రాత్రి హాస్టల్‌కు తిరిగి రాకపోవడంతో హాస్టల్ కేర్ టేకర్ యుగేందర్ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. సీఐ నీలం రవి తోటి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నాడు. రెండు రోజులుగా మూడిగా ఉంటున్నాడని, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని విద్యార్థులు హితేశ్ తల్లిదండ్రులకు, పోలీసులకు వివరించారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. విద్యార్థి సెల్ ఫోన్ ట్రేస్ చేయగా హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో చూపిస్తున్నదని, రెండు పోలీస్ బృందాలను పంపినట్లు సీఐ వివరించారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని వినతి

కోరుట్ల, నవంబర్ 21: పట్టణ శివారు మెట్‌పల్లి రోడ్డులో జాతీయ రహదారిని ఆనుకొని చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని 31వ వార్డు కౌన్సిలర్ పెండెం గణేశ్ గురువారం మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతి పత్రం అందజేశారు. జాతీయ రహదారి నుంచి వంద ఫీట్లు వదిలి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, కొంతమంది రియల్టర్లు మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

ధర్మపురి, నవంబర్ 21: బుగ్గారం మండలం వెల్గొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపిక అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేశం, శారద పాల్గొన్నారు.

సమగ్ర సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం

పెగడపల్లి, నవంబర్ 21: మండలంలో సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను గురువారం నుంచి ప్రారంభించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 15 కంప్యూటర్లలో వివరాలు నమోదు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కథలాపూర్, నవంబర్ 21: మండలంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ పూర్తి కావడంతో గురువారం ఆన్‌లైన్‌లో వివరాల నమోదు కార్యక్రమానిన ప్రారంభించారు. మండలంలో వందశాతం సర్వే పూర్తి చేయించాలనే లక్ష్యంతో ఆయా గ్రామాల్లో ఎంపీడీవో శంకర్ పర్యటించి వివరాలు సేకరించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక

పెగడపల్లి, నవంబర్ 21: పెగడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రాచకొండ రాహుల్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రమేశ్ తెలిపారు. ఈ నెల 23 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో రాహుల్ పాల్గొంటాడని వివరించారు. రాహుల్‌ను గురువారం ఎంఈవో సులోచనాదేవి, పాఠశాల హెచ్ఎం లలిత, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి, నవంబర్ 21: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. పెగడపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పొన్నగుట్ట మల్లికార్జునస్వామి రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మల్లాపూర్, నవంబర్ 21: గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జీ డీఏవో రాంచందర్ సూచించారు. మండలంలోని సిరిపూర్, మొగిలిపేట, మల్లాపూర్, రాఘవపేట, సాతారం గ్రామాల్లో గల ఎరువుల దుకాణాల్లో గురువారం ఆయన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఏవో మాట్లాడుతూ, ఎరువులను ఈ–పాస్ యంత్రం ద్వారానే విక్రయించాలని, దుకాణాల ఆవరణలో ధరల వివరాలు తెలుపుతూ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పురుగుల మందు రైతులకు విక్రయించేటప్పుడు రసీదు ఇవ్వాలన్నారు. అనంతరం దుకాణాల్లో రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ లావణ్య, ఏఈవో గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో మొగిలిపేట వాసి ఆత్మహత్య

మల్లాపూర్, నవంబర్ 21: మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన దండ్ల శ్రీనివాస్ (35) దుబాయ్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీనివాస్ మూడేళ్ల క్రితం దుబాయ్ వెళ్లి అక్కడ ఓ కంపెనీలో కూలీగా పనిచేస్తున్నాడు. కాగా, ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య అనిత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు